టయోటా కార్లు ప్రియం

న్యూఢిల్లీ, మార్చి 28: టయోటా కిర్లోస్కర్ కార్లు మరింత ప్రియం కాబోతున్నాయి. ఉత్పత్తి వ్యయం, నిర్వహణ ఖర్చులు పెరగడంతో వచ్చే నెల 1 నుంచి ఎంపిక చేసిన మాడళ్ల ధరలను ఒక్క శాతం వరకు పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. ఏయే మాడళ్ల ధరను పెంచుతున్నదో వెల్లడించలేదు. ప్రస్తుతం సంస్థ రూ.6.86 - 51.44 లక్షల లోపు పలు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

బీవోఐకి ఐటీ షాక్

న్యూఢిల్లీ, మార్చి 28: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఆదాయ పన్ను శాఖ షాకిచ్చింది. రూ.564.44 కోట్ల జరిమానా విధించింది. ఆదాయ పన్ను చట్టం, 1961 ప్రకారం సెక్షన్ 270 ఏ కింద ఐటీ డిపార్ట్‌మెంట్ ఈ ఆర్డర్‌ను జారీ చేసింది. దీనికి వ్యతిరేకంగా బ్యాంక్ ఐటీ శాఖ కమిషనర్, నేషనల్ ఫేస్‌లెస్ అప్పిల్ సెంటర్‌కు వెళ్లనున్నది. 2018-19లో బ్యాంక్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలపై రూ.564కోట్ల జరిమానా విధించింది.

కొటక్ మహీంద్రా చేతికి సానాటా ఫైనాన్స్

న్యూఢిల్లీ, మార్చి 28: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) సానాటా ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను రూ.537 కోట్లకు సొంతం చేసుకున్నట్టు కొటక్ మహీంద్రా బ్యాంక్ గురువారం ప్రకటించింది. 10 రాష్ట్రాల్లో సానాటాకు 549 శాఖలున్నాయి. గత ఏడాది డిసెంబర్ 31 నాటికి ఈ సంస్థ ఆధ్వర్యంలోని ఆస్తులు (ఏయూఎం) దాదాపు రూ. 2,620 కోట్లుగా ఉన్నాయి. కాగా, ఈ లావాదేవీతో సానాటా.. ఇకపై కొటక్ బ్యాంక్ అనుబంధ సంస్థగా మారింది.

2023-24 భళా

ఈ ఆర్థిక సంవత్సరం దుమ్మురేపిన దేశీయ స్టాక్ మార్కెట్లు

ఘనంగా వీడ్కోలు పలికిన సూచీలు

ఆల్‌టైమ్ హై రికార్డులతో మోత

లక్షల కోట్లలో పుంజుకున్న మదుపరుల సంపద

ఈ ఆర్థిక సంవత్సరం విశేషాలు

- 14,659.83 పాయింట్లు లేదా 24.85 శాతం ఎగిసిన సెన్సెక్స్
- 4,967.15 పాయింట్లు లేదా 28.61 శాతం ఎగబాకిన నిఫ్టీ
- రూ.1,28,77,203.77 కోట్లు పుంజుకున్న మదుపరుల సంపద
- మార్చి 7న మునుపెన్నడూ లేనివిధంగా 74,119.39 పాయింట్ల ఆల్‌టైమ్ హైని తాకిన సెన్సెక్స్. 22,493.55 పాయింట్ల లైఫ్‌టైమ్‌కు చేరిన నిఫ్టీ
- ఇంట్రా-డేలో సెన్సెక్స్ 74,245.17 పాయింట్ల రికార్డు. నిఫ్టీ సైతం 22,525.65 పాయింట్ల గరిష్ఠానికి చేరిక
- మార్చి 2న బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో రూ.394 లక్షల కోట్లకు

ముంబై, మార్చి 28: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) దుమ్మురేపాయి. బుల్‌రన్‌తో సూచీలు సరికొత్త శిఖరాలను అధిరోహించగా, మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో ఎగబాకింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ట్రేడింగ్‌కు చివరిరోజైన గురువారం కూడా మార్కెట్లు పరుగులు పెట్టాయి. దీంతో ఘనంగా వీడ్కోలు పలికినట్టైంది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 655.04 పాయింట్లు లేదా 0.90 శాతం పెరిగి 73,651.35 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 1,194 పాయింట్లు పెరగడం విశేషం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 203.25 పాయింట్లు లేదా 0.92 శాతం ఎగిసి 22,326.90 వద్ద స్థిరపడింది. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 819.41 పాయింట్లు లేదా 1.12 శాతం, నిఫ్టీ 230.15 పాయింట్లు లేదా 1.04 శాతం అందిపుచ్చుకున్నాయి.

కొనుగోళ్ల ఉత్సాహం

మదుపరులలో కొనుగోళ్ల ఉత్సాహం తొణికిసలాడింది. పవర్, క్యాపిటల్ గూడ్స్, యుటిలిటీస్, ఆటో, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్, కమొడిటీస్, టెలికమ్యూనికేషన్స్, మెటల్ షేర్లు ఆకట్టుకోవడంతో వరుసగా రెండోరోజూ సూచీలు లాభాల్లోనే ముగిశాయి. గ్లోబల్ స్టాక్ మార్కెట్లలో బుల్లిష్ ట్రెండ్ కూడా కలిసొచ్చినట్టు మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. ఇక సెన్సెక్స్ షేర్లలో బజాజ్ ఫిన్‌సర్వ్ దాదాపు 4 శాతం లాభపడింది. నెస్లే, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్, టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లూ పుంజుకున్నాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.62 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.33 శాతం ఎగిశాయి. ఆసియా మార్కెట్లలో చైనా, హాంకాంగ్ లాభాల్లో ఉంటే, జపాన్, దక్షిణ కొరియా నష్టపోయాయి.

రూ.386 లక్షల కోట్లకు..

బీఎస్‌ఈ సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరుల సంపద ఈ ఆర్థిక సంవత్సరం రూ.1,28,77,203.77 కోట్లు ఎగిసి రూ.3,86,97,099.77 కోట్లను చేరింది. గత ఆర్థిక సంవత్సరం (2022-23) రూ. 5,86,605.38 కోట్లే పెరిగింది. గత ఏడాది మార్చి 31న బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.2,58,19,896 కోట్లుగానే ఉన్నది. 2022-23లో సెన్సెక్స్ కేవలం 423.01 పాయింట్లు లేదా 0.72 శాతమే పెరిగింది. అయితే అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2021-22)లో రూ.59.75 లక్షల కోట్లకుపైగా పుంజుకున్నది.

మార్కెట్ విలువలో టాప్-5 సంస్థలు (రూ.కోట్లలో)

రిలయన్స్	20,14,010.63
టీసీఎస్	14,05,102.38
హెచ్‌డీఎఫ్‌సీ	11,00,184.60
ఐసీఐసీఐ	7,69,472.43
భారతీ ఎయిర్‌టెల్	6,99,081.86

ఈ ఆదివారం బ్యాంకులు ఓపెన్

మార్చి 31న పనిచేయనున్న అన్ని శాఖలు

న్యూఢిల్లీ, మార్చి 28: ఈ ఆదివారం దేశ వ్యాప్తంగా అన్ని బ్యాంకులు తెరుచుకునే ఉంటాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) చివరి రోజు కావడంతో ప్రభుత్వ లావాదేవీలకు, ఇతరత్రా చెల్లింపులకు, ట్యాక్స్ పేయర్స్‌కు ఆటంకం లేకుండా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ మేరకు 33బ్యాంకులకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎస్బీఐసహా 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ సహా 20 ప్రైవేట్ రంగ బ్యాంకులు, విదేశీ బ్యాంకైన డీబీఎస్ బ్యాంక్ ఇండియా ఆదివారం (మార్చి 31) అయినప్పటికీ సాధారణంగానే పనిచేయనున్నాయి. నెఫ్ట్, ఆర్టీజీఎస్ తోపాటు చెక్ క్లియరెన్సులు తదితర సేవలు యథాతథంగా సాగుతాయి.

నెమ్మదించిన కీలక రంగాలు

ఫిబ్రవరిలో 6.7 శాతంగా నమోదు

న్యూఢిల్లీ, మార్చి 28: కీలక రంగాల్లో మళ్లీ నిస్తేజం నెలకొన్నది. ఎరువుల రంగంలో నెలకొన్న నిస్తేజం కారణంగా ఫిబ్రవరి నెలలో కీలక రంగాల్లో వృద్ధి 6.7 శాతానికి పరిమితమైనట్లు కేంద్ర గణాంకాల శాఖ తాజాగా వెల్లడించింది. జనవరి నెలలో నమోదైన 4.1 శాతం కంటే భారీగా పెరిగినప్పటికీ, క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 7.4 శాతంతో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. ఎరువులతోపాటు రిఫైనరీ ఉత్పత్తులు, స్టీల్, విద్యుత్ రంగాలు నిరాశాజనక పనితీరు కనబరిచాయి. అయినప్పటికీ, బొగ్గు 11.6 శాతం పెరగగా, క్రూడాయిల్ 7.9 శాతం, సహజ వాయువు 11.3 శాతం, సిమెంట్ 10.2 శాతం చొప్పున వృద్ధిని కనబరిచాయి. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి మధ్యకాలంలో కీలక రంగాల్లో వృద్ధి 8.2 శాతం నుంచి 7.7 శాతానికి పరిమితమైంది. దేశీయ పారిశ్రామిక ప్రగతిలో కీలక రంగాల వాటా 40 శాతంగా ఉన్నది. ఈ సందర్భంగా ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ మాట్లాడుతూ..ఫిబ్రవరి నెలలో కీలక రంగాలు మూడు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయని, ఎనిమిది రంగాల్లో మూడు రెండంకెల వృద్ధిని సాధించడం వల్ల ఇది సాధ్యమైందన్నారు.

జట్టుకట్టిన అంబానీ-అదానీలు

అదానీ పవర్‌లో 26 శాతం వాటా కొన్న రిలయన్స్

న్యూఢిల్లీ, మార్చి 28: దేశీయ ప్రముఖ వ్యాపారవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీలు తొలిసారిగా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. గౌతమ్ అదానీకి చెందిన మధ్యప్రదేశ్ పవర్ ప్రాజెక్టులో 26 శాతం వాటాను ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కొనుగోలు చేసింది. అదానీ పవర్ లిమిటెడ్‌కు చెందిన మహాన్ ఎనర్జీ లిమిటెడ్‌లో రూ.10 ముఖ విలువ కలిగిన 5 కోట్ల ఈక్విటీ షేర్లను రిలయన్స్ హస్తగతం చేసుకున్నది. 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ విద్యుత్ యూనిట్‌ను అదానీ పవర్ లిమిటెడ్ నిర్వహిస్తున్నది. 20 ఏళ్లకు రిలయన్స్‌తో ఒప్పందం కుదిరినట్లు అదానీ గ్రూపు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం ఇచ్చాయి. 2,800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన పవర్ ప్లాంట్లో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్‌ను క్యాప్టివ్ యూనిట్ కోసం కేటాయించినట్లు తెలిపింది. సాధారణంగా క్యాప్టివ్ జనరేటింగ్ ప్లాంట్ నుంచి సొంత అవసరాలకు విద్యుత్‌ను వినియోగించాలంటే ఆ కంపెనీలో 26 శాతం వాటా ఉండాలనే నిబంధన ఉన్నది. ఈ విద్యుత్‌ను దేనికోసం వినియోగిస్తున్న విషయాన్ని మాత్రం రిలయన్స్ వెల్లడించలేదు. మరోవైపు చమురు, గ్యాస్, రిటైల్, టెలికం రంగంలో ముకేశ్ అంబానీ వ్యాపారాలు నిర్వహిస్తుండగా...గౌతమ్ అదానీ రేవులు, విమానాశ్రయాలు, బొగ్గు, గనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరూ క్లీన్ ఎనర్జీ వ్యాపార రంగంలోకి అడుగుపెట్టబోతున్నట్లు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

మళ్లీ పెరిగిన పసిడి

న్యూఢిల్లీ, మార్చి 28: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం మళ్లీ ప్రియమైంది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా ధరలు పెరుగుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో పదిగ్రాముల బంగారం ధర రూ.350 అందుకొని రూ.67,350 పిలికింది. అటు వెండి కూడా మరో రూ.200 ఎగబాకి రూ.77,450కి చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లోనూ 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.350 పెరిగి రూ.61,700కి చేరుకోగా, 24 క్యారెట్ల ధర రూ.380 అధికమై రూ.67,310కి చేరుకున్నది. పసిడితోపాటు వెండి ఏకంగా రూ.80 వేలు అధిగమించింది. రూ.300 పుంజుకొని రూ.80,500 పలికింది. అమెరికా ఆర్థిక గణాంకాలు విడుదలకు ముందే బంగారం ధరలు పుంజుకున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర ఒకే రోజు 14 డాలర్లు ఎగబాకి 2,194 డాలర్లకు చేరుకున్నది.

కార్వీ ఐఎస్ఎల్ రద్దు

న్యూఢిల్లీ, మార్చి 28: కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్ లిమిటెడ్ (కేఐఎస్ఎల్) రిజిస్ట్రేషన్‌ను క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ గురువారం రద్దు చేసింది. గత ఏడాది మార్చి 15-17 మధ్య కేఐఎస్ఎల్‌లో సెబీ తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పేర్కొన్న చిరునామాలో సంస్థ కార్యకలాపాలు సాగడం లేదని సెబీ గుర్తించింది. తదనంతర సోదాల్లోనూ కంపెనీకి ఉండాల్సిన కనీస అర్హతలూ లేవని తేలింది. దీంతో ఓ మర్చంట్ బ్యాంకర్‌గా ఎటువంటి నిబంధనల్నీ పాటించడం లేదంటూ సెబీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కంపెనీ రిజిస్ట్రేషన్‌ను తొలగించింది. 2013 డిసెంబర్‌లో సెబీ దగ్గర మర్చంట్ బ్యాంకర్‌గా కేఐఎస్ఎల్ నమోదైంది.

సీటు కోసం అదనంగా చెల్లిస్తున్నాం

44% విమాన ప్రయాణికుల మాట

ముంబై, మార్చి 28: విమాన టికెట్లు కొనేటప్పుడు సీట్ల కోసం అదనంగా చెల్లిస్తున్నామని ఓ సర్వేలో పాల్గొన్న 44 శాతానికిపైగా ప్రయాణికులు పేర్కొన్నారు. సీటు కేటాయింపు ఫీజుగా రూ.200ల నుంచి రూ.2,000 వరకు ఇస్తున్నామని చాలా మంది తెలిపారు. ఇది సదరు టికెట్ ధరలో 5 నుంచి 40 శాతం వరకు ఉందని ఈ సర్వేను చేపట్టిన లోకల్‌సర్కిల్స్ సంస్థ పేర్కొన్నది. అయితే కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కన్జ్యూమర్ రెగ్యులేటర్ సీసీపీఏ గత ఏడాది ఎయిర్‌లైన్స్‌తో దీనికి సంబంధించి సమావేశం జరిపిన నేపథ్యంలో తాజా సర్వే ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. కాగా, దేశవ్యాప్తంగా 339 జిల్లాల్లోని 41వేల మంది ఈ సర్వేలో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. విమానాల్లో కుటుంబంతో ప్రయాణించాలన్నా, పిల్లలతో వెళ్లాలన్నా చాలా మంది సమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తుండటంపై ఈ సర్వే దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే కుటుంబ సభ్యులంతా కలిసి ఒకేచోట ప్రయాణించాలంటే టికెట్ ధరపై అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుందని తేలింది. ఇక మధ్య వరుసలోని సీట్లకు తప్ప మిగతా సీట్ల కోసం, ముఖ్యంగా విండో సీట్ల కోసం ఎక్కువగా చెల్లించాల్సి వస్తున్నదని ప్రయాణికులు అంటున్నారు.